అమ్మసూక్తులు - ఆణిముత్యాలు



శ్రీవిశ్వజననీపరిషత్

జిల్లెళ్ళమూడి - **522 114,** ఫోన్:08643 - 227324.

జిల్లెళ్ళమూడిలో సేవాసంస్థలు

అన్నపూర్ణాలయం : ఆకలే అర్హతగా ఆదరంగా అందరికీ కుల మత వర్ణ వర్గ విచక్షణారహితంగా ప్రసాదం అందించే విభాగము.

విద్యాలయం : సంస్కృతకళాశాల - పాఠశాల ఉచితంగా వసతి, భోజనము, విద్య అందించే స్థలం.

వైద్యాలయం : గ్రామస్థులకు చుట్టుప్రక్కల గ్రామాలకు కూడా ఉపయోగపడే ప్రభుత్వ హోమియో వైద్యశాల, మాతృశ్రీ మెడికల్ సెంటరు. ఉచితంగా వైద్యము, మందులు అందించే సేవాసంస్థలు.

అనసూయేశ్వరాలయం, హైమాలయం, నవనాగేశ్వరా లయం, వినాయకాలయం : అధివ్యాధులకు దివ్యౌషధంగా ఆధ్యాత్మిక జీవులకు శాంతిని ప్రసాదించే ప్రదేశాలు.

మాతృశ్రీ గ్రంథాలయం : సాహిత్య, ఆధ్యాత్మిక గ్రంథాల నిలయం

మాతృశ్రీ పబ్లికేషన్ ట్రస్ట్ : అమ్మ సాహిత్య ప్రచురణ 'విశ్వజనని' మాసపత్రిక నిర్వహించుట

ఆదరణాలయం : వృద్ధులకు ఏ ఆసరాలేనివారి కొరకు

కానుక

అమ్మ సూక్తులు - ఆణిముత్యాలు. మన అనుభవం లోనికి వచ్చినపుడు ఆశ్చర్యపోతాం, ఆనందంతో మనస్సు పొంగిపోతుంది. కళ్ళ వెంట ఆనందాశ్రువులు రాలుతవి. ఒళ్ళు గగుర్పాటు చెందుతుంది. అమ్మ ఒక మేధావి కాదు. ఒక క్రాంతదర్శి కాదు, ఒక మార్గనిర్దేశకురాలు కాదు, ఒక ఉపదేశకురాలు కాదు వీటన్నిటినీ మించి అన్నీ అయి మాతృత్వ రూపం దాల్చి వాత్సల్యాన్ని చిందించిన చైతన్య శక్తి. బిడ్డల సందేహాలు తీరుస్తూ గోరుముద్దలు నోటి కందించినట్లు అమ్మ పలికిన మాటలు సూక్తులై, ముత్యాలై ఏరుకున్న వారికి ఏరుకున్నంత భాగ్యాన్ని అందించాయి.

నిత్యనూతనంగా ఉండే ఈ మాటలు అమ్మ అనుభవాల మూటలు. అందుకే అనుభవ వేదాంతనిధులు మాతృశ్రీ సూక్తిసుధలు అని మేము తెలుసుకున్నాం. ఆ సూక్తులు ముత్యాలై సత్యాలై లోకాన్ని చైతన్యవంతం చేస్తున్నాయి. అందుకే లోక కళ్యాణం కోసం నిత్య మననం కోసం కానుకగా సమర్పిస్తున్నాం.

జిల్లెళ్ళమూడి

శ్రీ విశ్వజననీపరిషత్

అక్షరదీపాలు

1. తల్లి అంటే తొలి
2. అమ్మ అంటే సంపూర్ణ అవతారం కాదు. సంపూర్ణత్వం
3. ఎవడి అన్నం వాడికుంటే వాడు తింటున్నాడు. ఎవరికి ఎవరో పెట్టేదేముంది.
4. అసలైన అమ్మకు ఎవరిని చూచినా బిడ్డ అనే అనిపిస్తుంది.
5. భర్త అంటే శరీరమే కాదు భావన కూడ.
6. సుఖం అంటే ఎవరిష్ట ప్రకారం వాళ్ళకు జరగటమే.
7. ఒకనాటి మాట మరొక నాటికి బాట అవుతుంది.
8. తెలుసుకున్నది తెలివి; అనుభవించేది అనుభవం.
9. సవరణ అవసరం లేనిది వివరణ.
10. నాలుగు వేదములు పొయ్యి, చీపురు, రోలు, రోకలి, కత్తిపీట, పంచమవేదం చేట.

11. త్రిగుణములు ఉప్పు, కారము, పులుపు.
12. మానవుని నడక నవగ్రహాల మీద ఆధారపడి లేదు. రాగద్వేషాలనే రెండే గ్రహాల మీద, ఆ రెండింటికీ ఆధారం 'నేను'.
13. భరించలేనిదే బాధ.
14. సహించలేనిదే హింస.
15. ఇష్టం లేనిదే కష్టం.
16. అవసరమే విలువైనది.
17. గణనక్కూడా అందనిది గండం.
18. వర్గంలేనిది స్వర్గం.
19. ముముక్షుత్వమే మోక్షం.
20. వైకల్యం లేనిది కైవల్యం.
21. తృప్తే ముక్తి.
22. తనను తాను విమర్శించుకోవటం వివేకము. ఇతరులను విమర్శించటం అవివేకం.
23. ప్రేమించటమూ ద్వేషించటమూ తనకొరకే.
24. నవ్వుతూ అనుభవించేవాడి దగ్గరకు-ఏడుస్తూ అనుభవించేవాడు సలహాకు వస్తాడు.

25. సంఘటనల కూర్పే జీవితం.
26. ఆశా అసంతృప్తుల కలయికే జీవితం.
27. అనుకున్నది చేతలలో కనబడుతుంది. అన్నది కనపడదు.
28. అందరికీ సరిపోయేదే సూక్తి.
29. ఒక బాధ తగ్గవలెనంటే మరొకటి రావాలి.
30. రెండు వస్తువులు కలిస్తేగాని మరొక వస్తువు గుణం బైటికి రాదు.
31. శిల్పానికి అందం రావాలంటే ఉలిదెబ్బ లవసరం.
32. మహావాక్యాలు అనుభవం లేకపోతే మన వాక్యాలే.
33. సాహిత్యంతో రాహిత్యం కాదు.
34. కడతేర్చేవి మాటలు కావు.
35. అధైర్యమే ధైర్యానికి ఆధారం.
36. చీకటే వెల్తురు కాధారం.
37. ఇతరులతో తగాదా ఆడటం పోరాటమూ, తనతో తాను పోరాడటమే ఆరాటమునూ.
38. మానవుడే తర్కం.

39. నోటితో చెప్పుకుంటే బాధ కానీ అనుభవిం చటం తేలికే.
40. చెయ్యలేనిదే హింస, ధర్మం అనేది ఎవరో చెప్పింది.
41. పెద్దవాళ్ళు చిన్న ఆలోచనలు చేస్తే చిన్నపిల్లలు పెద్ద ఆలోచనలు చేస్తారు.
42. తనను కన్న వాళ్లమీద కంటే తాను కన్నవాళ్ళ మీద ప్రేమ ఎక్కువ.
43. ప్రేమ అనేది ఉంటే నువ్వేదిచేసినా ఇష్టమే.
44. చేస్తున్నా పోట్లాడేది కుమారుడు; పోట్లాడుతున్నా చేసేది తల్లి.
45. భారం వహించే శక్తి ఎక్కడ ఉన్నదో అక్కడే మాతృత్వం.
46. పంచటంలో హెచ్చు తగ్గు లుండవచ్చు కానీ, పెట్టటం సమానమే.
47. తనకు తాను మెప్పించుకున్నప్పుడే ప్రపంచాన్ని మెప్పిస్తున్నాను అనుకుంటాడు.
48. నచ్చక పోవటమే తప్పు.
49. అనుకున్నది తన కోసం అనుకుంటాడు. అన్నది ఇతరుల కోసం అంటాడు.

50. చిక్కించుకునే చిక్కం అల్లేవాడి దగ్గరుంటుంది.
51. మలిచేవాడే మరిపిస్తాడు.
52. ప్రాణం ఇచ్చినవాడే తీస్తాడు.
53. యమదూతలు అమ్మ దూతలు కాకపోతేగా?
54. అనుకున్నది జరగదు; తనకున్నది తప్పదు.
55. మనం అనుకున్నట్లు జరిగితే 'పురుష ప్రయత్నం' కాకుంటే 'దైవ నిర్ణయం'
56. ఒకటి అనుకున్నప్పుడు మరొకటి జరిగితే మనల్ని మించినదేదో ఉన్నదనిపిస్తుంది.
57. నడవనివ్వని శక్తులన్నీ నడిపించే శక్తిమీదే ఆధారపడి వున్నాయి.
58. మంచికేదో చెడుకూ అదే కారణం.
59. తిథులు విధిని మార్చలేవు.
60. 'సంచితం', 'ఆగామి', ప్రారబ్దం దేనికి ఏది ముందు?
61. తప్పని తెలిసీ చెయ్యడం తప్పించుకోలేక.
62. తానొకటి తలిస్తే దైవమొకటి తలుస్తాడు కాదు; దైవం తలుస్తేనే తాను తలుస్తాడు.
63. సంధానం కాపటమే కానీ చెయ్యటం కాదు.

64. కలత లేకపోతే నలత ఏమి చేస్తుంది?

65. దేవులాడినా దొరకనివాడే దేవుడు.

66. గుళ్ళో దేవుడూ గుడి మీద కోతులూ.

67. ఆధారం ఎప్పుడూ అజ్ఞాతంగానే వుంటుంది.

68. జీవితమూ జీవనమూ భగవంతుడిచ్చినవే.

69. ఇచ్చినదే సంస్కారం, తెచ్చుకున్నది కాదు.

70. బాధ లేకపోతే బ్రతకటం అనవసరం.

71. సంతానం లేదనే సంతాపం లేకపోవడమే సంతానం.

72. దూరశ్రవణ దర్శనాదులు ఆధ్యాత్మిక శక్తికి అత్యల్పాలు.

73. నేర్పుగల ఓర్పుకాదు, సహజమైన ఓర్పు కావాలి.

74. లేనిదానికొరకు ఆశించేది దుఃఖము, ఉన్నది చాలనుకునేది సుఖం.

75. వింటే విమర్శకానీ కంటే విమర్శ లేదు.

76. చెప్పేది అను భావం తనలో ఉద్భవించేది అనుభవం.

77. నవ్వు సంతోషమూ కాదు, కన్నీళ్ళు దుఃఖమూ కాదు.

78. సహజం లోంచి విశేషాన్ని విడదీసి మళ్ళీ దాన్ని సహజం చేసుకోవాలి.

79. (ఆలోచన మెదడుకు స్వభావమా?) ఆ స్వభావమే భగవంతుడు.

80. తరుణం అంటే తప్పనిసరి.

81. తరుణమే ఋణం.

82. విధి వర్షం లాంటిది. కొందరికి కనుకూలం. కొందరికి ప్రతికూలం.

83. ఎవరూ మనకున్నదానిని వదిలించలేరు; లేనిదాన్ని తెచ్చి పెట్టలేరు.

84. చేతులూ చేతలూ వాడివే, చేతులు నీవనుకుంటున్నావు కనుక చేతలూ నీవే అనుకుంటున్నావు.

85. జరిగే పనంతా కర్మే, చేయించేదంతా కర్తే.

86. ప్రారబ్ధం భగవంతుడు.

87. నా సంకల్పంతోనే మీరు జన్మ యెత్తి నాలోనే లీనం అవుతారు.

88. రూపం లేనిది రూపం ధరించటమే సృష్టి.
89. వ్యష్టిత్వం లేకపోతే సృష్టి ఏముంది?
90. భగవంతుడికి ప్రత్యామ్నాయం దేవాలయాలు.
91. అమ్మ అంతులేనిది, అద్దులేనిది, ఆధారమైనది.
92. అమ్మ అంతులేనిది, అద్దులేనిది, ఆధారమైనది.
93. సర్వానికి సర్వమూ ఆధారమే.
94. సృష్టి సహజం.
95. అసలు కారణం అసలుకే తెలియాలి.
96. జనన మరణాలు అనుక్షణం జరుగుతునే ఉన్నాయి.
97. పంచభూతాల సమ్మేళనమే గాయత్రి.
98. రూపము పురుషుడు, లోని శక్తి ప్రకృతి.
99. వికారంతోనే ఆకారం వచ్చింది.
100. సమష్టి యొక్క వ్యష్టిత్వమే ప్రపంచం.
101. మంచి చెడ్డలంటే హెచ్చు తగ్గులే.
102. పరిణామమే కాని నాశనం లేదు.
103. చూస్తే కనబడను; కనబడితే చూస్తారు.
104. రూపాంతరమే కాని రూపనాశనం లేదు.

105. స్థితులు పొందటం కాదు; ఇవ్వటమే.

106. ఆయా సమయాల్లో ఆయా పనులు చేయించటమే కరుణ.

107. అనిర్వచనీయమైనది ఆశీర్వచనం.

108. పశ్చాత్తాపమే ప్రాయశ్చిత్తం.

109. సందేహనివృత్తి చేసేదే సందేశం.

110. అనుభవం శాస్త్రాన్నిస్తుంది కాని శాస్త్రం అనుభవాన్నివ్వలేదు.

111. పరిస్థితులను మించిన గురువు లేడు.

112. గుర్తు చెప్పినవాడే గురువు.

113. ఉపదేశమంటే దైవసన్నిధికి చేర్చటం.

114. మనస్సు, పదార్థము, పరమార్థము ఒకటే.

115. కాలవ నిండుగా ప్రవహిస్తున్నా దాహమయితే దిగటానికి రేవు కావాలి.

116. ఆచరణకి ఏ మతమేనా ఒకటే.

117. పెట్టింది ముహూర్తం కాదు జరిగినదే ముహూర్తం.

118. జరక్క తప్పనిదే నిర్ణయం.

119. నీకు సాధ్యమైనదే సాధన అంటే.

120. తోచిందేదో చెయ్యి. తోపింపచేసేవాడు వాడేగా.

121. అవకాశాన్ని గమనించటం 'సాధన'

122. ఇష్టదైవం తప్ప నేను లేను అనుకున్నది ఉపాసన.

123. అన్ని మంత్రాలూ ఒకటే.

124. ఎందులోనైనా ఒకే శక్తి ఉన్నది.

125. అర్థం తెలిసి అశుద్ధానికి పూజ చేసినా వాడికే చెందుతుంది.

126. చెప్పింది మంత్రం కాదు. మననంతో మంత్రం అవుతుంది.

127. తృప్తినీ హాయినీ శాంతినీ ఇచ్చి సందేహనివృత్తి చేయగలిగినదే మంత్రం.

128. 'ఇది ఏమిటి?' పంచాక్షరి.

129. 'అసలు ఇది ఏమిటి?' అష్టాక్షరి.

130. మంత్రమంటే భగవంతుని రూపమే.

131. మనస్సే మంత్రం : శబ్దమే బీజం : దాని నిలకడకి అక్షరాలు.

132. ఒక పెన్నిధి అండన చేరడం పెండ్లి.

133. భావం తెలుసుకుని ప్రవర్తించేదే భార్య; బాధ్యత తీసుకుని భరించేవాడే భర్త.

134. ఏం చేసినా ఎవరి మీద అయిష్టత కలగదో వాడే యిష్ట దైవం.

135. పాతివ్రత్యమంటే పతిని ఆధారం చేసుకుని పంచభూతాలను జయించటం.

136. పాతివ్రత్యానికి చరమదశ భర్తకూడా భార్యను 'అమ్మా' అని పిలవటం.

137. సర్వాన్నీ స్వాధీనం చేసుకున్నదే సాధ్వి.

138. ప్రేమకంటే ధర్మం గొప్పది.

139. విశ్వాసమే భగవంతుడు.

140. సంకల్ప పేరూ, దైవం వేరూ, మనస్సు వేరూ కాదు.

141. మహాతత్త్వానికి మహాత్మ్యాలతో పని లేదు.

142. మరణమంటే పరిణామమే.

143. మరుపే మరణం.

144. శరీరధారియై వుండి అనుక్షణం చస్తున్నాడు.

145. పరిణామానికి చరమదశ బ్రహ్మ స్వరూపం.
146. జన్మకు కారణం ఆకారణం.
147. కోరిక లేని స్థితిని సంపాదించుకోవటానికి ప్రయత్నం సన్యాసం.
148. హద్దులే మడి.
149. లింగభేదం రూపభేదం స్పర్శభేదం లేనివాడు సన్యాసి.
150. సర్వభక్షకుడైన వాడే భిక్షకుడు.
151. పురుషకారమూ దైవ సహాయమూ రెండూ ఒక దానివే.
152. నిగ్రహం కొరకే విగ్రహారాధన.
153. ధారణమే ఆరాధన.
154. ధ్యాస కూడా క్రియే.
155. లడ్డు అవటంలో కన్నా తినటంలో రుచి ఉంది.
156. లక్ష్మణుడు రాముడి దగ్గరున్నాడు. భరతుడు రాముణ్ణి దగ్గరుంచుకున్నాడు.
157. ఏది చూచిన ఎందులోనైనా ఒకే వస్తువును చూడటం ఏకాగ్రత.

158. అన్నిటిలో ఒకటినే చూడటం అద్వైతం.
159. నాట్యం దర్శించేవాడు భక్తుడు.
160. నాట్యం తానైనవాడు జ్ఞాని.
161. గుర్తుతో గుర్తించి గుర్తు నశించాలి.
162. సక్రమంగా గణించటం చేతనైతే సమాధాన మొక్కటే.
163. ఏ పాదాలకు నమస్కరించినా ఆ పాదాలకే అందుతాయి.
164. అంతా అయిందీ అర్థం కానిదీ అద్వైతం.
165. లేనిది ఉన్నట్లు కనపడటం భ్రాంతి; ఉన్నది లేనట్లు కనపడటం భ్రమ.
166. ఉన్నది ఉన్నట్లు కనబటమే లోచూపు.
167. భ్రాంతి అంటే మమకారం, భ్రాంతి వదలితే బ్రహ్మ.
168. ద్వంద్వాలు బ్రహ్మగా గుర్తించిందే ఆనందం.
169. అందరూ నా ఒడిలోనే తిరుగుతున్నారు. ఒడి విడిచి ఎవరూ లేరు.
170. జ్ఞానం పొందటమే కాని జ్ఞానం వల్ల పొందటమేమీ లేదు.

171. రెండుగా కనపడటం అజ్ఞానం; అన్నీ ఒకటిగా కనబడటమే జ్ఞానం.
172. భిన్నత్వం లేనిదే దైవత్వం.
173. అంతా జీవమయం, నా దృష్టిలో జడమే లేదు.
174. శరీరం ఆత్మ కాకపోలేదు.
175. 'నేను' 'నీవు' గా వున్న అహంకార బ్రహ్మ; 'నేను' 'నేను' గా అహం బ్రహ్మాస్మి.
176. తనలో 'నే' ననేది అంతటా వుంది.
177. కర్మ క్రియ కర్తలోవే
178. జ్ఞానమే భగవంతుడు.
179. గుర్తించే గుర్తులేక దీపమున్నా గుర్తించలేరు.
180. తన్ను తాను గుర్తించిన వాడు సర్వాన్ని గుర్తిస్తాడు.
181. అన్ని రూపాలూ ఒకటే నన్న స్థాయి రావటమే దైవత్వం.
182. మారేది మారని దాన్లోంచి పుట్టింది.
183. మిథ్య కర్థం 'లేదు' అని కాదు, 'మార్పు' అని.
184. ఇది కాదు, ఇది కాదు, అంటూ అంతా అదే ననటం.

185: అన్ని రూపాలూ ఆయనవే కనుక రూప రహితుడు.

186. అన్ని గుణాలూ ఆయనవే కనుక గుణ రహితుడు.

187. అన్ని నామాలూ ఆయనవే కనుక నామ రహితుడు.

188. అన్ని సంకల్పాలూ ఆయనవే కనుక సంకల్ప రహితుడు.

189. ఉత్తమమైనటువంటిది తానైతే అల్పం తానుకాదా?

190. ప్రజ్ఞానం బ్రహ్మ అయిత అజ్ఞానం ఎందుకుకాదు?

191. అన్నం పరబ్రహ్మమయితే అశుద్ధం ఎందుకుకాదు?

192. శబ్దం బ్రహ్మ అయితే సైలెన్సూ బ్రహ్మే.

193. మనస్సుకూ ఆహారానికి సంబంధం లేదు.

194. అవయవాలచేత మనస్సు కట్టుబడేది ప్రాణాయామం, మనస్సు చేత అవయవాలు కట్టుబడేది భక్తి

195. ఆధార మాధరమయితే అంతా సహస్రారమే.

196. స్థితులు పొందటం కాదు ఏర్పడి వుంటయ్ మానవులకే కాదు జీవ జంతువులన్నిటికీ.

197. ఎన్నిసార్లు గీత చదివినా మన గీతను బట్టే జరుగుతుంది.

198. ఏ యోగం చేసినా భక్తే.

199. సంసారమంటే సంకల్పమే.

200. భగవత్సంకల్పము కాదు సంకల్పమే భగవంతుడు.

201. ఈ సంకల్పం మనది కాదనుకోవడమే సంకల్పరాహిత్యం.

202. అనుభవాన్ని మాటల్లో పెట్టేటప్పటికి యాదార్థం మరుగున పడుతుంది.

203. పొరపాట్లతో కూడినదే మానవత్వం.

204. నేను చేస్తున్నాననేది మానవత్వం.

205. కొంత తనదీ చాలమట్టుకు దేవుడిని అనుకోవటం మానవత్వం.

206. ద్వంద్వాలలో తోచే సంకల్పమే మానవత్వం.

207. పరిమితమైన మమకారం మానవత్వాన్ని సూచిస్తుంది.

208. రెండు అనుకుని మాట్లాడతావు కానీ రెండూ అయి మాట్లాడలేవు.

209. సర్వత్రా అనురాగమే విరాగము.

210. దిగులే జిజ్ఞాస.

211. ధ్యాసే ధ్యానం.

212. చేసేదంతా దైవసేవ అనుకుంటే నిష్కామం.

213. సర్వం తెలుసుకున్నవాడు స్థితప్రజ్ఞుడు.

214. ఇతరులలో మంచిని చూడటమే మన మంచితనం.

215. ఇతరులలో లోపం చూడకపోవటమే తన పవిత్రత.

216. ఇతరులలో దైవత్వాన్ని చూస్తున్నంత సేపూ మనలో దైవత్వం కలుగుతుంది.

217. సర్వాన్నీ పూజ్యభావంతో చూసేవారే పూజ్యులు.

218. సుఖానికి మార్గం ఒక్కటే - ఏది చేసినా దైవం చేశాడనుకోవటమే.

219. ఏ మార్గాన నడచినా వాడే నడిపిస్తున్నాడనుకోవటమే సన్మార్గం.

220. అందరి పిల్లల్ని ప్రేమిస్తే విశ్వమాత కాదూ?

221. సరైన కమ్యూనిజం అద్వైతం.

222. దైవత్వమంటే నాలుగుచేతులూ, కిరీటమూ కాదు.

223. సర్వత్రా వుండే మమకారం మాధవత్వాన్ని గుర్తింపజేస్తుంది.

224. ఏకత్వంగల సంకల్పమే దైవత్వం.

225. అన్నీ తానే అనుకునే మనస్తత్త్వమే భగవంతుడు.

226. అన్నీ ఉన్నవాడు భగవంతుడు.

227. నేను బ్రహ్మనై, నీవు అనే వస్తువు ఏర్పర్చుకొని నీవు నేను మధ్యలో ఉండే సంధి బ్రహ్మపదార్థం.

228. విచక్షణలేని వీక్షణే అనుగ్రహం.

229. రెండు లేనివాడూ రెండూ అయినవాడూ భగవంతుడు.

230. ఇది కావాలని లేకపోవటమే ఆనందం.

231. నేను అదే అనుకోవటం లేదు; ఇదే అనుకుంటున్నాను.

232. అన్నిటా ఋమిడి ఉన్నశక్తి దైవత్వము.

233. శక్తి పెరిగేదీ లేదు; తరిగేదీ లేదు.

234. సహనమనే దేవత నారాధించాలంటే బాధలనే పూజాద్రవ్యాలు కావాలి.

235. ఆరాధనంటే ఆవేదనే.

236. నీవైన నేను తెలుసుకోవటమే జ్ఞానం.

237. అంతా ఆత్మగా తోచటమే ఆత్మసాక్షాత్కారం.

238. జనన మరణాలు గురించి క్రుంగు పొంగులు లేక పోవటమే అమృతత్వం.

239. నువ్వు, నేను అనేది పోనంతవరకూ అంతా ద్వైతమే.

240. ఆత్మకు ప్రతి జగత్తు.

241. ఇన్ని బ్రహ్మలు లేవు.

242. మారుతూ కూడా ఉన్న బ్రహ్మ ఒకటే.

243. గాఢత్వమే భక్తి మూఢత్వం.

244. సర్వకాల సర్వావస్థల , యందూ సమానమైనస్థితియే సమాధి.

245. అవధులు లేనిది సమాధి.

246. దేహంతో వుండీ దేహము కూడా తానైనవాడు విదేహి.

247. తృప్తి అంటే ఇంతకన్నా మరొకటి లేదనే స్థితి.

248. తెలిసి అనుభవించేదే ఆనందం.

249. అందరికి తలా ఒక రాతయినా చివరకు అన్నీ ఒకే రాతలో కలుస్తాయి.

250. అందరికీ సుగతే, కాస్త ముందు వెనుకలే తేడా గాని.

251. ఎవరికైనా తప్పదు వచ్చిన చోటికి- పోక.

252. ఈ కలిలో నాకు ఆకలి లేదు.

253. అందరికీ సమ్మతమైనదే నా మతం.

254. బాధకు కారణం బేధం.

255. మనసుకు తగిలితే బాధ, శరీరానిగి తగిలితే నొప్పి.

256. అర్థం కావడమే అనుభవం.

257. తపనే తపస్సు.

258. మీలో నేను దైవత్వం చూస్తాను, మీరు నాలో మానవత్వం చూస్తారు.

259. నమస్కారం అంటే నీవిచ్చిన శరీరాన్ని నీకు అర్పణ అని తలవంచడం.

260. నమ్మకమే దైవం.

261. ఇష్టం అయిష్టం తప్ప పాపపుణ్యాలు లేవు.

262. శాస్త్రమంటే శాసించేది, శాశ్వతమైనది.

263. నిర్వేదమంటే తెలియకుండా అనుభవించే బాధ.

264. లక్ష్యం లేక పోవడమే మరుపుకు కారణం.

265. రాయిలో చైతన్యం చూడగల మనం, మనిషిలో చైతన్యం చూడలేకపోతున్నాం.

266. తరుణం అంటే తప్పించుకుందామన్నా తప్పనిది, చేద్దామనుకొన్నా చేయనీయనిది.

267. ఆధ్యాత్మికానికి లౌకికానికి తేడాలేదు.

268. విశ్వరూపదర్శనమంటే ఈ కనబడే దానిని భగవంతునిగా చూడటమే.

269. పంచామృతాలు అనగా ఒకే అమృతం నుండీ పంచబడినవి. పాలు, పెరుగు, మీగడ, వెన్న, నెయ్యి.

270. జ్ఞాని మానవుడిలో దైవాన్ని చూస్తాడు, అజ్ఞాని దైవంలో మానవుణ్ణి చూస్తాడు.

271. స్థిమితమైన ప్రజ్ఞ కలవాడే స్థితప్రజ్ఞుడు.

272. నేను మీ గుణగణాలు చూచి ప్రేమించడం లేదు, నాకోసమే ప్రేమిస్తున్నాను.

273. నేను దగ్గరకు తీయటం తప్ప మీరు నా దగ్గరకు రావడం కాదు.

274. నా గాధ వెలలేని గాధ.

275. నా జీవితం అబద్ధం, చరిత్ర బద్ధం.

276. నాకు మరుగూ లేదు, మరపూ లేదు.

277. నేను నేనైన నేను, అన్ని నేనులు నేనైన నేను.

278. ఏది వచ్చినా, సమంగా చూడగలిగిన గాఢమైన మార్పులేని భావమే బ్రహ్మానందం.

279. శ్వాసతో మనస్సు నిలవదు, మనస్సుతో శ్వాస నిలుస్తుంది.

280. క్షరం కానిది తెలుసుకోవటమే జ్ఞానం.

281. అనేకం ఒకటిగా చూడటమే ఆత్మసాక్షాత్కారం.

282. నాకు పిల్లల కోసం ఆశ, చాలక అసంతృప్తి.

283. నా జీవిత చరిత్ర పండితుడైన పామరుడు వ్రాయడు, పామరుడైన పండితుడు వ్రాస్తాడు.

284. బ్రహ్మజ్ఞానం కాదు, జ్ఞానమే బ్రహ్మ.

285. నేను నిండు గృహిణిని, నాకు బ్రహ్మ చర్యమంటే ఏమిటో తెలియదు.

286. రాగద్వేషరహితమైనది అనసూయ, అత్రి అంటే త్రికాలాలు, త్రివిధావస్థలు లేనివాడు.

287. రూపం లేనిది రూపం ధరించడం సృష్టి.

288. పరిణామమే దైవం.

289. బ్రహ్మచైతన్యం, సరస్వతి తెలివి.

290. మృత్యుంజయుడంటే చనిపోకుండా ఎల్లకాలం వుండటం కాదు, చావుని గురించి ఆలోచన, భయమూ లేనివాడు.

291. శుక్ల శోణితాలకు యేదికులమో అదే నా కులం.

292. పెళ్ళిలో పెద్దపులి వున్నదనుకొనే వారి భయం పోగొట్టడానికే నాకు పెళ్ళి.

293. మనస్సు లయమయ్యే చోటు ఆలయం.

294. దేహమే సంధేహం.

295. తరుణమే ఋణం.

296. అడిగినవాళ్ళకు అడిగినదే ఇస్తాను, అడగని వాళ్ళకు అవసరమైనది ఇస్తాను.



హైమవతి దేవి, జిల్లెళ్ళమూడి